VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 17 ఆగస్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 04

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## కొండెక్కిన పూల ధరలు



2లో

## నేడు దేశవ్యాప్తంగా 24 గంటల పాటూ వైద్య సేవలు బంద్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటన






2లో

## విప్లవాత్మక జీఎస్టీపై పునరాలోచన ఏదీ ?

ఈ భారాలపై ఎక్కడ మొర పెట్టుకోవాలి

ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీ విధించడం ఎంతకాలం


మధ్యతరగతి ప్రజలకు భారంగా సొంతింటి కల



## ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో మరో ఘనత సాధించింది. శ్రీహరికోట షార్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇవాళ ఉదయం సరిగ్గా 9 గంటల 17 నిమిషాలకునిప్పులు చిమ్ముతూ అంతరిక్షంలోకి వెళ్లింది. 17 నిమిషాల పాటు సాగిన ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కాగా.. 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. పర్యావరణం, ప్రకృతి విపత్తులను పర్యవేక్షణ టార్గెట్ గా సైంటిస్టులు ఈ మిషన్ ను ప్రవేశపెట్టారు. ఈ ఎస్-ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ బరువు 119 టన్నులు, ఎత్తు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్లుగా ఉన్నాయి. భూ ఉపరితలం నుంచి 475 కిలోమీటర్ల ఎత్తున శాటిలైట్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా డిజైన్ చేశారు. ఈవోఎస్-08 శాటిలైట్ బరువు 175.5 కిలోలు. ఇక ఈ శాటిలైట్‌లో మూడు పే లోడ్స్‌ని ఇస్రో శాస్త్రవేత్తలు అమర్చారు. అవి ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ , పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లు.. ఇవి భూమికి సంబంధించిన చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. అలాగే ఇవి తీసిన పిక్స్ ని పరిశీలించి వాతావరణం పరిస్థితులు, విపత్తులపై అధ్యయనం నిర్వహిస్తారు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు సేవలను అందజేయనుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో తెలిపింది. అంతేకాదు, ఇది %యూూాం% ప్రాజెక్ట్‌కు అవకాశాలను తీసుకొస్తుందని, సరికొత్త మిషన్లకు శ్రీకారం చుడుతుందని ఇస్రో చెబుతోంది. పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఎక్కు సమయం, ఖర్చు కూడా అధికమే. కానీ, ఎస్-ఎస్ఎల్వీ చాలా ప్రత్యేకమైనది.

## బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం తథ్యం



**న్యూఢిల్లీ:** బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయడం తథ్యమని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఖండించినా.. అది ఎప్పటికీ జరుగి తీరుతుందని అన్నారు. విలీనం అయిన వెంటనే కేసీఆర్ కు గవర్నర్ పదవి, కేటీఆర్ కు కేంద్రమంత్రి పదవి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో హరీష్ రావు ప్రతిపక్ష నేత అవుతారని అన్నారు. విలీనం, పదవులు రాగానే.. కవితకు నాలుగు రాజ్యసభ సీట్లతో సమానంగా బెయిల్ వస్తుందని వెల్లడించారు. అదేవిధంగా బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనమయ్యే అవకాశం ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ బిజీ షెడ్యూల్ లో ఉన్నారు. ఈరోజు ఢిల్లీలో ఫాక్స్‌కాన్-యాపిల్ మ్యానుఫ్యాక్చరర్స్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన పెట్టుబడులే లక్ష్యంగా సాగిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి సొంత దేశంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఫాక్స్‌కాన్-యాపిల్ మాన్యుఫ్యాక్చరర్స్ కంపెనీ ప్రతినిధులతో భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగంలోని పెద్దలను కూడా కలిసే అవకాశం ఉందని తెలిపారు. ఇక కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ లు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ చర్చించనున్నారు. వరంగల్‌లో జరిగే రైతు కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని సీఎం ఆహ్వానించనున్నారు. రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సోనియాను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెండు మూడు రోజుల పాటు సీఎం రేవంత్ ఢిల్లీలోనే ఉండనున్నారు.

## మంకీఫాక్స్ అంటువ్యాధి

మంకీఫాక్స్‌ను గ్లోబల్ ఎమర్జెన్సీగా ఆరోగ్య సంస్థ ప్రకటన

ఆఫ్రికా దేశంలో 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదు

హైదరాబాద్‌లోనూ అప్రమత్తమైన అధికారులు



న్యూఢిల్లీ: కరోనా కంటే మంకీఫాక్స్ డేంజర్,ఇది అంటువ్యాధి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటన జారీ చేయడంతో హైదరాబాద్ నగరంలో అలర్ట్ ప్రకటించారు. ఆఫ్రికా దేశ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఉన్న నేపథ్యంలో అప్రమత్తత ప్రకటించారు.ఆఫ్రికా దేశంలో ఇప్పటికే 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదయ్యాయి.ఈ మహమ్మారి వల్ల 460 మంది మరణించారు. ఇది అంటువ్యాధి కావడంతో ఆఫ్రికన్ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఉన్నందున డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆఫ్రికాలో మంకీపాక్స్ వైరస్ కేసులు పెరుగుతుండటంతో ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ వాచ్‌డాగ్ ప్రజారోగ్యశాఖ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.ఈ వైరస్ వ్యాప్తి

మిగతా 2లో

## రుణమాఫీ మొత్తం బోగస్





**హైదరాబాద్:** రుణమాఫీ పేరిట సీఎం రేవంత్ రెడ్డి మోసానికి తెరలేపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రుణమాఫీ మొత్తం బోగస్ అని.. మిలియన్ డాలర్ల జోక్‌గా తేలిపోయిందని విమర్శించారు. అందుకే దాని నుంచి అటెన్షన్ డైవర్షన్ చేయడానికే ఈ రకమైన విన్యాసాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చెబుతున్న ఈ రుణమాఫీ.. స్వతంత్ర భారత దేశంలోనే రైతులకు జరిగిన అతిపెద్ద మోసమని కేటీఆర్ మండిపడ్డారు. ఒక దారుణమైన దగా, ఒక మాయ అని అన్నారు. రైతన్నలతో క్రూరమైన పరిహాసం ఆడిందని కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. అడ్డగోలు ఆంక్షలు, అర్థం లేని షరతులు, కూతలు-కోతలతో రైతు రుణమాఫీ ఉందన్నారు. అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందని అన్నారు. అర్హులైన రైతుల్లో సగం మందికి కూడా రుణమాఫీ జరగలేదని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ కోసం 40వేల కోట్లు అవుతుందని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి ముందు చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక సంవత్సరం నేను కడుపుగట్టుకుంటే ఈ డబ్బును అనాయసంగా కట్టేయొచ్చని రేవంత్ చెప్పిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఎన్నికలు అయిపోగానే మళ్లీ ఈ లెక్క మారింది.. 31వేల కోట్లతో రుణమాఫీ చేయాలని కేబినెట్ తీర్మానించిందని తెలంగాణ సీఎంవో జూలైలో ఒక ట్వీట్ చేసిందని తెలిపారు. రుణం తీసుకున్న ప్రతి ఒక్కరూ అర్హులే అని ఎన్నికల ముందు చెప్పారని.. ఇప్పుడు కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ లెక్కలు చూస్తే.. ఉద్యోగికి రుణమాఫీ కట్.. పెన్షనర్‌కు కట్.. ఇన్‌కం ట్యాక్స్ కట్టేటోళ్లకు కట్.. రేషన్ కార్డు లేకుంటే కట్ చేశారని కేటీఆర్ అన్నారు. ఇవన్నీ ఎన్నికల ముందు చెప్పలేదని అన్నారు. సీఎం అంటే నిజానికి చీఫ్ మినిస్టర్.. కానీ ఇప్పుడు కటింగ్ మాస్టర్‌లా పరిస్థితి అయిపోయిందని ఎద్దేవా చేశారు. 60 శాతం మందికి ఎగ్గొట్టి.. కేవలం 40 శాతం మందికి చేసి.. 100 శాతం రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్న మొట్ట మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. ఇంతకుమించిన దగా, మోసం, రైతు ద్రోహం మరొకటి ఉండదని విమర్శించారు. సవాలక్ష కొర్రీలు, దిక్కుమాలిన ఆంక్షలతో మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను బ్యాంకులు, అధికారుల చుట్టూ పడిగాపులు గాచే పరిస్థితి తీసుకొచ్చారని అన్నారు. అంకెలు మార్చి.. రంకెలు వేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. మార్పు మార్పు అని రైతులను ఏమార్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొదటి మోసం.. లోక్‌సభ ఎన్నికలకు ముందు దేవుడి మీద ఒట్లు పెట్టి రెండో మోసం.. కేసీఆర్ మీద ద్వేషం.. సకలజనులకు మోసం.. అనేది ప్రభుత్వ పాలసీగా ఉందని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ మోసం, రెండు లక్షల ఉద్యోగాలు మోసం.. ఆడబిడ్డలకు నెలకు రూ.2500 మోసం, తులం బంగారం మోసం, విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు మోసం, 4వేల నిరుద్యోగ భృతి మోసం, జాబ్ క్యాలెండర్ మోసం, దళితులకు 12లక్షలు ఇస్తామన్న మోసం, ఆటో అన్నలకు ఏడాదికి 12 వేలు మోసం, రైతు కూలీలకు నెలకు వెయ్యి మోసం, కౌలు రైతులకు రైతు భరోసా మోసం.. మొత్తంగా చూస్తే రుణమాఫీనే అతిపెద్ద మోసం అని విమర్శించారు.రుణమాఫీకి ఎన్నికల ముందు చెప్పింది 40వేల కోట్లు, కేబినెట్ తీర్మానంలో చెప్పింది 31వేల కోట్లు, బడ్జెట్‌లో చెప్పింది 26వేల కోట్లు అని చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ ఆఖరకు నిన్నటివరకు జరిగిన రుణమాఫీ కేవలం 17,934 కోట్లు మాత్రమే అని తెలిపారు. 22,37,748 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు. ఇన్ని కోతలు పెట్టి.. పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టి.. చిల్లర మాటలు, చిల్లర కూతలు అని విమర్శించారు. ఇందులో కూడా ఎన్ని వస్తాయో, ఎన్ని ఖాతాల్లో పడతాయో, దానికి సంబంధించి ఎన్ని కటింగ్‌లు ఉంటాయో తెలియదని అన్నారు.

అన్నదాతలను సీఎం నిండాముంచారు

రుణమాఫీ పేరిట సీఎం మోసానికి తెరలేపారు

రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం



2లో

## ఎమ్మెల్సీగా ప్రమాణంచేసిన కోదండరాం, అమీర్ అలీఖాన్

ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

# కొండెక్కిన పూల ధరలు శ్రావణ మాసం వేళ ధరల పెరుగుదల

**హైదరాబాద్:** శ్రావణ మాసం వచ్చిందంటే ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. ప్రతి ఇంట్లో పూజలు, నోములు, వ్రతాలు శుభకార్యాలతో మార్మోగుతాయి. ఈ శ్రావణంలో ప్రతిరోజూ పూజా కార్యక్రమాలతో పాటు పలు శుభకార్యాలు.. వివాహ ముహూర్తాలు, గృహప్రవేశాలు, నిశ్చితార్థాలు, నూతన వ్యాపార ప్రారంభోత్సవం.. శ్రావణమాసంలో లేదా కార్తీక మాసంలో ఎన్నో శుభకార్యాలు జరుగుతాయి. పువ్వుల ధరలు ఆ స్థాయిలో పెరిగాయి కాబట్టి ఎక్కువ పూల పరిమళాలు వెదజల్లే ఇల్లు ధనవంతుడిలా ఉంటుంది. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని నగరంలోని పూల మార్కెట్లు కిటకిటలాడాయి. నగరవాసులు తెల్లవారుజాము నుంచే పూల కోసం మార్కెట్లకు పోటెత్తారు. బంతి, చామంతి, కనకాంబర, తామరపూలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక జత రూ.30కి లభించే కమలాలు నేడు దాదాపు రూ.100కి చేరాయి. గత నెల మల్లెలు కిలో రూ.550 ఉండగా ప్రస్తుతం రూ.1500 పలుకుతోంది. తెల్ల చామంతి రూ.200 నుంచి రూ.350, కనకాంబరం రూ.100 నుంచి రూ.300, పసుపు చామంతి రూ.150 నుంచి రూ.400, కలువ రూ.150 నుంచి రూ.500, జాజులు రూ.300 నుంచి రూ. .1,200 పలుకుతుండటంతో శ్రావణ మాసం కావడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. మరోవైపు అమ్మవారికి పూల మాలలకు గిరాకీ ఎక్కువైంది. పూజలో ఉపయోగించే దండలను మరింత అందంగా తీర్చిదిద్ది మార్కెట్ లో అందుబాటులో ఉంచారు. అరటి కొమ్మలు, తమలపాకులు, అలంకరణకు ఉపయోగించే అన్ని రకాల పూలను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే సామాన్య ప్రజలు ఏ పువ్వుల ధరలు చూసిన అమ్మో.. అనే పరిస్థితి ఏర్పడింది.

# నేడు దేశవ్యాప్తంగా 24 గంటల పాటూ వైద్య సేవలు బంద్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటన



**న్యూఢిల్లీ:** కోల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో 31 ఏళ్ల జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. జూనియర్ డాక్టర్ హత్యకేసులో నిందితులను శిక్షించాలని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. గత ఏడు రోజులుగా ఆరోగ్య సేవలు స్తంభించగా, తోటి విద్యార్థికి న్యాయం చేయాలంటూ జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్, అత్యవసర సేవలు నిలిచిపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.కాగా, ఆసుపత్రిని సందర్శించిన గవర్నర్ బోస్ సంబంధిత జూనియర్ వైద్యులతో మాట్లాడారు. దేశంలోని అన్ని నగరాల్లో వైద్యులు నిరసనలు తెలుపుతున్నారు. విధుల నుంచి బహిష్కరించిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ట్రైనీ డాక్టర్ హత్యకు నిరసనగా రేపు దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. 17వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అత్యవసర వైద్య సేవలకు మినహాయింపు ఉంటుంది. ఈ మేరకు అర్ధరాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. మరోవైపు జూనియర్ డాక్టర్ హత్యపై పశ్చిమ బెంగాల్ అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళా స్వాతంత్ర్యం కోసం నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల అర్ధరాత్రి మహిళలు నిరసన తెలిపారు. ఆందోళనకారులుగా చెప్పుకుంటున్న దాదాపు 40 మంది వ్యక్తులు గురువారం అర్ధరాత్రి %=+% కార్ హాస్పిటల్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. ఆందోళనకారులు ఆస్పత్రి ఆవరణలోకి చేరుకుని అత్యవసర విభాగం, నర్సింగ్ స్టేషన్, మందుల దుకాణం, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు.

# మంకీఫాక్స్ అంటువ్యాధి

పలు ఆఫ్రికన్ దేశాల్లో, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వ్యాపిస్తుంది.మంకీపాక్స్‌ను కాంటినెంటల్ సెక్యూరిటీ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటిస్తున్నామని ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అధిపతి జీన్ కసేయా చెప్పారు.-ఆఫ్రికన్ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి వచ్చి ఉన్నందున, ఈ అంటు వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఉన్నత విద్య అభ్యసించే ఆఫ్రికన్ విద్యార్థులకు హైదరాబాద్ ప్రముఖ గమ్యస్థానంగా ఉంది.డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆఫ్రికన్ విద్యార్థులపై వైద్యులు దృష్టి సారించారు. ఆఫ్రికాలో 2022వ సంవత్సరంలో మంకీఫాక్స్ వ్యాధిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది.ఈ వైరస్ మశూచి వంటి లక్షణాలతో కూడిన వైరల్ జూనోటిక్ వ్యాధి అని తేలింది. ఈ వైరస్ మంకీపాక్స్ వైరస్ వల్ల సంభవిస్తుంది.ఈ వ్యాధిని మొదటిసారిగా 1958వసంవత్సరంలో కోతుల్లో కనుగొన్నారు. మొదటి మానవ కేసు 1970వ సంవత్సరంలో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వెలుగుచూసింది. 2003వ సంవత్సరంలో ఆఫ్రికా వెలుపల మొట్టమొదటి మంకీపాక్స్ వ్యాప్తి అమెరికాలో వెలుగుచూసింది. మంకీఫాక్స్ వైరస్ గాలి ద్వారా సంక్రమించే కోవిడ్‌లా కాదు.ఈ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం, లైంగిక సంపర్కం లేదా గాయాలతో సన్నిహిత సంబంధం ద్వారా మాత్రమే వ్యాధి సోకుతుంది. మంకీఫాక్స్ లక్షణాలు:మంకీఫాక్స్ వైరస్ లక్షణాలు శోషరస గ్రంథుల వాపు, జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, తీవ్ర బలహీనతలుంటాయి. జ్వరం వచ్చిన 1-3 రోజులకు చర్మంపై దద్దుర్లు మొదలవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గురువారం మంకీపాక్స్‌ను అంతర్జాతీయ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో, ప్రజలు ఈ వైరస్ ప్రమాద కారకాలు,ఎక్స్‌పోజర్‌ను తగ్గించే చర్యల గురించి తెలుసుకోవాల్సి ఉందని డాక్టర్లు చెబుతున్నారు.ఆఫ్రికా దేశం నుంచి హైదరాబాద్ కు విద్యార్థులు వచ్చినందున,మంకీఫాక్స్ వైరల్ ఇన్‌ఫెక్షన్ గురించి సాధారణ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ నగరానికి చెందిన ఆశ్రిత ఆసుపత్రి డాక్టర్ రామ్మోహన్ రావు చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఆఫ్రికా విద్యార్థుల వల్ల మంకీఫాక్స్ వైరస్ ప్రబలినట్లు ఎలాంటి కేసులు రాలేదని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. ఈ వైరస్ గురించి హైదరాబాద్ లో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని డాక్టర్ రాజారావు కోరారు. ఆఫ్రికన్ దేశాలకు చెందిన మంకీఫాక్స్ రోగుల ప్రయాణ చరిత్రను తప్పనిసరిగా ట్రాక్ చేయాలి.మంకీపాక్స్ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం ద్వారా వ్యాపిస్తుంది. గత 21 రోజుల్లో ఆఫ్రికా నుంచి హైదరాబాద్ వచ్చిన వారి ప్రయాణ చరిత్రను పరిశీలించాల్సి ఉంది.శరీరంపై తీవ్రమైన దద్దుర్లు ఉంటే,వారు



# ఎమ్మెల్సీగా ప్రమాణంచేసిన కోదండరాం, అమీర్ అలీఖాన్




**హైదరాబాద్**: తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లు శాసనమండలిలో అడుగుపెట్టారు. ఈ మేరకు ఇద్దరితో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణం చేయించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్ అలీఖన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ సి.మహేష్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన తర్వా త కోదండరామ్ మాట్లాడారు. తాను ఎమ్మెల్సీగా నియామకం కావడంతో ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ పదవిని అదనపు బాధ్యతగా మాత్రమే భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నేను ఎప్పుడూ ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షల మేరకు పనిచేస్తానని ప్రకటించారు. ఈ పదవి చాలామంది బలిదానాలు చేయడంతో వచ్చిందని, వాళ్లను ఎప్పటికీ మరవమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వీరిద్దరిని గతంలోనే నామినేట్ చేయగా.. ఈ విషయంపై బీఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లింది. నియామక గెజిట్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ఈ విషయంపై ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీగా నియామించాలంటూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సిఫార్సులను అప్పటి గవర్నర్ రద్దు చేసిన సంగతి తెలిసిందే.

# విప్లవాత్మక జిఎస్టీపై పునరాలోచన ఏదీ ?

**న్యూఢిల్లీ:** భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. ఒకే పన్ను విధానం అంటూ జిఎస్టీని తీసుకుని వచ్చినా పన్నుల భారాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించడం లేదు. ప్రతి పనికి జిఎస్టీని విధించడం దారుణం కాక మరోటి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, బీమా మొత్తాలపై జిఎస్టీ విధించడం దారుణం కాక మరోటి కాదు. దీనిపై ఇటీవల పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చినా ఆర్థికమంత్రి చెప్పిన సమాధానం ప్రజలను అవమానించేదిగా ఉంది. దీనిని ప్రస్తావించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీని కూడా నిర్మలా సీతరామన్ అవమానించారు. ఒక్కరు ప్రస్తావించిన అంశాన్ని 200మంది పట్టుకుని సాగదీసారని తన తలబిరుసు సమాధానంతో చెప్పారు. పెట్రో ధరలపై జిఎస్టీ విధించడం లేదు. గ్యాస్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ప్రజలు కడుతున్న పన్నులతో పాలకులు రాజ్యాలు ఏలుతున్నారు. తమ సుఖాలకు ఖర్చు చేస్తున్నారు. పథకాల పేరుతో వంచన చేస్తున్నారు. నిజానికి జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి. పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. ఇల్లు కొనాలంటే రకరకాలు పన్నుల రూపంలో బాదేస్తున్నారు. రిజస్ట్రేషన్లకు రాష్ట్రాలు లక్షల్లో వసూలు చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఇలా రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని గతేడాది రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతు న్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు. అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చుకుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం.

# సత్యసాయి జిల్లా కేంద్రం మార్పు..!

**హిందూపురం:** శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం మార్పుపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంగా పుట్టపర్తి కాకుండా హిందూపురాన్ని జిల్లా హెడ్ క్వార్టర్ గా చేయాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు బాలయ్య.. ఈ రోజు తన నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు.. స్వయంగా టిఫిన్ వడ్డించారు.. ఆ తర్వాత పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీబిజీగా గడిపారు.. అయితే, ఈ పర్యటనలోనే ఆయన హిందూపురంను జిల్లా కేంద్రంగా మార్చాలనే ప్రతిపాదనలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు.. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.. అంతేకాదు.. సత్యసాయి జిల్లా పేరులో ఎలాంటి మార్పు చేయకుండా.. జిల్లా హెడ్ క్వార్టర్ ను హిందూపురం చేయాలంటూ గతంలోనే బాలకృష్ణ ఆందోళన చేపట్టిన విషయం విదితమే.. తాజాగా బాలకృష్ణ వ్యాఖ్యలతో మరోసారి సత్యసాయి జిల్లా కేంద్రం మార్పు తప్పదా? అనే చర్చ నడుస్తోంది. కాగా, శ్రీ సత్యసాయి జిల్లా ఆంధ్రప్రదేశ్లో ఒక జిల్లా%"% జిల్లాల పునర్వ్యవస్థీకరణ భాగంగా 2022లో పాత అనంతపురం జిల్లాలో నుండి ఈ జిల్లా ఏర్పడింది. జిల్లా కేంద్రం పుట్టపర్తిగా నిర్ణయించారు.. అయితే, శ్రీ సత్య సాయి జిల్లాలో పెద్ద పట్టణంగా హిందూపురం ఉంది.. దాంతో.. అప్పటి నుంచి అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న నందమూరి బాలకృష్ణ.. హిందూపురంను శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ వినిపిస్తూ వస్తున్నారు. మరి, ఇప్పుడు ప్రభుత్వం కూడా మారడంతో అటువైపు అడుగులు పడతాయేమో చూడాలి.

# నా కొడుకుపై తప్పుడు కేసులు

**మంగళగిరి:** మంగళగిరిలో మాజీ మంత్రి జోగి రమేష్ పోలీసు విచారణ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత స్పీకర్ అయ్యన్న పాత్రుడు అప్పటి సీఎం జగన్ పై అసభ్య పదజాలంతో తిట్టారు.. అందుకే నేను చంద్రబాబు దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేయాలని వెళ్లాను.. నిరసన తెలుపుతున్న నాపై దాడి చేసారు.. రాజకీయాల్లో విలువలు, విశ్వస నీయత అవసరం.. ప్రజలు మంచి విజయాన్ని ఇచ్చారు.. పాలకులు కక్షపూరిత వాతావరణంలో రాజకీయాలు చేస్తే ప్రజలు అన్ని గమనిస్తూనే ఉంటారు అని ఆయన పేర్కొన్నారు. వివాదాస్పద భూములు కొనాలని ఎవరూ అనుకోరు.. అభం శుభం తెలియని నా కొడుకుపై తప్పుడు కేసులు పెట్టి ఆనంద పడుతున్నారు అంటూ మాజీ మంత్రి జోగి రమేశ్ వెల్లడించారు. ఇక, రాజకీయ కోపాలు ఉంటే నా మీద తీర్చుకోండి అని జోగి రమేశ్ పేర్కొన్నారు. పిల్లలు జోలికి వెళ్ళడం సరి కాదు.. మీకు అనుమానాలు ఉంటే, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల దగ్గరకు వచ్చి అనుమానాలు తీరుస్తా.. అంతేకాని రెడ్ బుక్ రాజ్యాంగం అవసరం లేదు.. 2002 నుంచి నేను ఒకే నంబరు వాడుతున్నా.. పోలీసులు అడిగిన ఏ సమాచారం అయినా ఇస్తా.. పరుష పదజాలం వాడిన మా పరిస్థితి ఏమయ్యిందో.. ఇప్పటి పాలకుల పరిస్థితి అదే అవుతుంది అని మాజీ మంత్రి జోగి రమేశ్ వెల్లడించారు.

# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది అబద్ధం

**హైదరాబాద్:** బీజేపీ లో బీఆర్ఎస్ విలీనం అనేది శుద్ధ అబద్ధమని.. అలాంటి చర్చ బీజేపీ లో లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఏమైనా మాట్లాడుకుంటునరేమో.. దాన్ని బట్టి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ఉండొచ్చని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ మమ అనిపించిందని మండిపడ్డారు. పూర్తి స్థాయి లో రుణమాఫీ ఈ ప్రభుత్వం చేయలేదు.. ప్రజల్ని రైతుల్ని సీఎం మోసం చేశారని అన్నారు. హైడ్రా పేరుతో అడ్డగోలుగా కూల్చివేతలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అడ్డగోలుగా కూలగొట్టి అధికారం వారికి ఎవరు ఇచ్చారన్నారు. పరిధిలో ఉన్న భూములు ప్రభుత్వ భూములు కాదు.. అవి రైతులవి అన్నారు. అప్పట్లో ఎందుకు నిర్మాణాలకు అనుమతి ఇచ్చారన్నారు. ఇక పై నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. %ా==% లోపల ప్రాంతాల విలీనం అనేది ఏదో గీతలు గీసినట్టు ఉండకూడదు%"% అన్ని అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ గ్రాఫ్ ఏమీ పడిపోలేదు%"% ఒక్కో సారి ఒక్కోలా ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్ష మార్పు పై నాకు ఎలాంటి సమాచారం లేదు%"% పార్టీ చూసుకుంటుందని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల విషయం లో గతం లో కేటీఆర్ మాట్లాడినట్టే రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని తెలిపారు. వేల కోట్ల పెట్టుబడులు అనేది తప్పన్నారు. లోకల్ వారిని ప్రోత్సహించాలన్నారు.

# హైదరాబాద్ నగరంలో పలుచోట్ల భారీ వర్షం



**హైదరాబాద్:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలో పలుచోట్ల భారీ వర్షం కురుస్తుంది. మరో రెండు గంటల పాటు భారీ వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బంజారా హిల్స్, మాధాపూర్, హైటెక్స్ సిటీ, పంజాగుట్ట, అమీర్ పేట్ పలు ప్రాంతాలలో వాన కురుస్తుంది. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా వర్షం కాస్త ఊరటనిచ్చింది. భారీ వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.ఆగస్టు 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, సంగారెడ్డి, మెదక్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సూర్యాపేట, మహబూబ్, వరంగల్, సూర్యపేట, హనుమకొండ, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాత్రి 9 గంటల వరకు సికింద్రాబాద్‌లోని పాటిగడ్డలో అత్యధికంగా 74.8 మి.మీ, బన్సీలాల్‌పేటలో 73.0 మి.మీ వర్షం కురిసింది. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) అధికారులు వెల్లడించారు. ముషీరాబాద్‌లో 73, రామచంద్రాపురంలో 68.5, కూకట్‌పల్లిలో 64.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాల విషయానికి వస్తే సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 93.5 మిల్లీమీటర్లు, నాగర్ కర్నూల్ జిల్లాలో 87 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే, దయచేసి 040-21111111 లేదా 9000113667కు కాల్ చేయండి.

## విషం చిమ్ముతున్న బిఆర్ఎస్ నేతలు ఏ పనిచేసినా బురదజల్లడమే వారి పని

**హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కూర్చొని కొత్త వేషంలో ప్రజల్ని ఎలా మోసం చేయాలని ఆలోచిస్తుంటే.. కేటీఆర్, హరీశ్ రావులు కాంగ్రెస్‌పై విషం చిమ్ము తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ మంచి పని చేసినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కేటీఆర్, ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వారిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8నెలల్లోనే అనేక కార్యక్రమాలు చేస్తుంటే కేటీఆర్, హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. వీరిద్దరూ
అధికారం పోయిన ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు అర్థం అవుతోందని ఆయన ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి బీఆర్ఎస్ నేతలు తెలంగాణ ప్రజల సొమ్ము దోచుకున్నారని, అపరిచితుడు సినిమాలో ఉండే శిక్షలన్నీ కేసీఆర్ కుటుంబానికి వేయాలని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళలపై రికార్డింగ్ డ్యాన్సులు అంటూ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదేనా మీ సంస్కారం అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్ రావులు సిరిసిల్ల, సిద్దిపేటలో కాకుండా బయటకు వచ్చి పోటీ చేయాలని శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో హరీశ్ రావు ఇరిగేషన్ మంత్రిగా అవినీతి ప్రాజెక్టులు కట్టారని ఆయన ఆరోపించారు. మీ పదేళ్ల పాలనలో రూ.1.30లక్షల కోట్ల అప్పులు చేశారని మండిపడ్డారు. అలాంటి మీరు ఇంకా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీ విధ్వంసకర పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిందని అన్నారు. తెలంగాణకు దిష్టి చుక్కలుగా మీరిద్దరూ మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. కాగ్నిజెంట్ శంకుస్థాపన ఎలా సాధ్యం అని కేటీఆర్ విమర్శిస్తున్నారు. మా ప్రభుత్వం చిత్తశుద్ధి చూసి పెట్టుబడులు పెట్టేందుకు వారు ముందుకు వచ్చారని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

## జమ్ము-కశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు



**న్యూఢిల్లీ:** జమ్ము-కశ్మీర్‌తో పాటు హర్యానా రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. పలు దశల్లో సమీక్షల అనంతరం కశ్మీర్‌లో ఎన్నికలకు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని పార్టీల అభిప్రాయాలు కూడా తీసుకున్నామని.. ఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్18న తొలిదశ, 25న రెండో దశ, అక్టోబర్1న మూడో దశ ఎన్నికలు జరుగుతాయి. ఫలితాలు అక్టోబర్4న వెలువడతాయి. మొత్తం 90 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అటు హర్యానలోని 90 నియోజకవర్గాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 1న సింగిల్‌ఫేజ్‌లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు 4న వెలువడతాయి. అక్టోబర్6 వరకూ రాష్ట్రంలో కోడ్ కొనసాగుతుంది. కాగా జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఇదే తొలి అసెంబ్లీ ఎన్నికలు. ఆగస్టు 9న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తన బృందంతో జమ్మూ కాశ్మీర్‌లో పర్యటించారు. వీలైనంత త్వరగా ఇక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు కమిషన్ కట్టుబడి ఉందని చెప్పారు. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

### కేసీ వేణు గోపాల్ నేతృత్వంలో

## ప్రజాపద్దుల కమిటీ

### ప్రకటన జారీ చేసిన స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ:** పార్లమెంటులో ప్రజాపద్దుల సంఘాన్ని ఏర్పాటు చేస్తూ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ప్రకటన జారీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణు గోపాల్ నేతృత్వంలో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఈ కమిటీ ఆడిట్ నిర్వహిస్తుంది. లోక్ సభ, రాజ్యసభ నుంచి 29 మంది సభ్యులు ఇందులో ఉంటారు. నలుగురు తెలుగు ఎంపీలకు సైతం కమిటీలో చోటు దక్కింది. లోక్‌సభ నుంచి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జనసేన ఎంపీ బాలశౌరి, రాజ్యసభ నుంచి బీజేపీ సభ్యుడు డా.లక్ష్మణ్‌లకు చోటు దక్కింది. 2025 ఏప్రిల్ 30 వరకు ఈ కమిటీకి గడువు ఉంటుంది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అనేది పార్లమెంటు.. ప్రభుత్వ ఆదాయ, వ్యయాలను ఆడిట్ చేసే ఉద్దేశంతో ఎంపిక చేసిన సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ. ప్రధాన ప్రతిపక్షానికి చెందిన ఓ సభ్యుడు ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ భారత పార్లమెంటు మూడు ఆర్థిక స్టాండింగ్ కమిటీలలో ఒకటి. పార్లమెంటు సమక్షంలో వివిధ పనులకు మంజూరైన నిధులు సరైన పద్ధతిలో ఖర్చు చేశారా? లేదా? అని మానిటర్ చేయడం పీఏసీ పని. కంఎ÷-టోల్రర్, ఆడిటర్ జనరల్ (అంఉ) నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టిన తర్వాత ఈ కమిటీ పరిశీలిస్తుంది. పీఏసీని 1921లో రూపొందించారు. ఇందులో 29 మంది సభ్యులు ఉంటారు. కమిటీ ఛైర్‌పర్సన్‌ని లోక్ సభ స్పీకర్ నియమిస్తారు. ఇందులోని సభ్యుల పదవీ కాలం ఒక ఏడాది. 18వ లోక్‌సభలో కాంగ్రెస్ రెండో అతిపెద్ద పార్టీగా అవతరించడంతో పీఏసీకి నాయకత్వం వహించే అర్హత పొందింది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తర్వాత ఆ పార్టీ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి 2019 జులై నుంచి పీఏసీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. తాజాగా అదే పార్టీకి చెందిన సీనియర్ నేత కేసీ వేణుగోపాల్‌ని ఛైర్మన్‌గా నియమిస్తూ లోక్‌సభ స్పీకర్ ఆమోదం తెలిపారు.

# క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవాలి.

## - రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి.







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 16**

ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. మాధవ్ నగర్ లోని ఇందుర్ క్యాన్సర్ ఆసుపత్రి లో బ్రిడ్జ్ గ్యాప్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే భూపతి రెడ్డి, చిన్నబాబు సుంకాల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, జ్ఞానేంద్రియాల క్యాన్సర్ ఎక్కువగా సోకుతుందని అన్నారు. వ్యాధి ముదిరే వరకు తెలుసుకోకపోవడం వల్ల ప్రాణాలకు ముప్పు వస్తుందన్నారు. అందుకే ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటుగా ప్రత్యేక పరీక్షలు నిర్వహించి తే వ్యాధి నిర్ధారణ కొరకు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ, 50 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు క్యాన్సర్ కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని దీని మూలంగా ప్రాథమిక సమయంలోనే గుర్తించి వైద్యం చేయటానికి అవకాశం ఉంటుందని అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ సహకారంతో క్రమం తప్పకుండా తాము ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టుగా ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ యూరాలజిస్ట్ డాక్టర్ శ్రీని అత్తిలి మాట్లాడుతూ ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి నందు క్యాన్సర్ కు సంబంధించి అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, వైద్య పరీక్షలు నిర్ధారణ, చికిత్స ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే ఇక్కడ మెరుగైన ట్రీట్మెంట్ లభిస్తోందని ఆయన అన్నారు. డాక్టర్ బుద్ధా శ్రీనివాస్, డాక్టర్ కిరణ్, డాక్టర్ సూరి తదితరుల నేతృత్వంలో
క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్
ఈవిల్ నారాయణ, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, కార్యదర్శి ప్రసాద్ రావు, నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యేను తెలంగాణ ఆల్ పెన్షనర్స్ సన్మానించింది. దాదాపుగా వందమందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు.



## ఈవీఎం గోదాంలను సందర్శించిన జిల్లా కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఆగస్టు 16**

జిల్లా కేంద్రంలో రెండు ఈవీఎం గోదాములను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం గోదాం తాళాలను తీయించారు. గోదాంలో ఉన్న చెడిపోయిన ఈవీఎంలను పరిశీలించారు. ఈవిఎంలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఈవీఎంలను ఈసీఎల్, బెంగళూరు, బెంక్, బిహెచ్ఎల్ కంపెనీలకు పంపుతామని ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు రఘునాథరావు, ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్ కుమార్, అనిల్ కుమార్, ప్రియదర్శిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంజన్, కాసిం, తదితరులు పాల్గొన్నారు.

## 17శాతం ఎచ్ఆర్ఏ ను చెల్లించాలి.

### - టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 16**



నగర కార్పొరేషన్ సరిహద్దు నుండి 8 కి.మీ. ల పరిధిలో ఉన్న గ్రామాలు, తండాలకు 17శాతం ఎచ్ఆర్ఏ అమలు చేసే క్రమంలో గతంలో ఇచ్చిన ఉత్తర్వుల జాబితాలో కొన్ని చేర్చలేదని, వాటిని కూడా జాబితా లో చేర్చాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీ కిరణ్ కుమార్ కు టిఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ, మాక్లూర్ మండలం లోని అమ్రాదు తండా, మదన్ పల్లి తండా, సట్లాపూర్ తండా, గద్వాల్ క్యాంపు, వేణు కిసాన్ నగర్, ఒడ్డెర కాలనీ (మామిడిపల్లి ), జక్రాన్ పల్లి మండలంలోని పుప్పాలపల్లి, డిచ్ పల్లి మండలం లోని వెస్లీ నగర్ లకు 17 శాతం ఇంటి అద్దె అలవెన్స్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్, జిల్లా ట్రెజరర్ ఎమ్. మల్లేష్, జిల్లా కార్యదర్శులు ఎమ్. జనార్దన్, వి. సాయన్న పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

### పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగడతో జలమయం

### బయటకు రావద్దని నగర ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. సికింద్రాబాద్, బేగంపేట్, మారేడుపల్లి, కూకట్‌పల్లి, మూసాపేట్, కేపీహెచ్‌బీ కాలనీ, బాచుపల్లి, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్, మియాపూర్, లింగంపల్లి, గచ్చిబౌలి, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, కోఠి, లక్డీకాపూల్, ఎల్బీనగర్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. డ్రైనేజీలు పొంగడంతో రహదారులపైకి నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జీహెచ్‌ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. సాయం కోసం 040 21111111కు ఫోన్ చేయాలని



జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. వర్షం కారణంగా నగరవ్యాప్తంగా ట్రాఫిక్ సమస్య నెలకొంది. లక్డీకాపూల్, ఖైరతాబాద్, అమీర్‌పేట, ఖాజాగూడ కూడలి, మల్కంచెరువు, బయోడైవర్సిటీ కూడలి, ఐకియా కూడలి, గచ్చిబౌలిలోని ప్రధాన రహదారులపై వాహనాలు బారులు తీరాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేతప్పా బయటకి రావద్దని.. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కూకట్‌పల్లి, మూసాపేట్, కేపీహెచ్‌బీ, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్‌లోభారీ వర్షం కురుస్తోందని, పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, అమీర్‌పేట, వెంగళరావు నగర్, యూసఫ్‌గూడ, ఐడీఏ బొల్లారం, గుమ్మడిదలలో అతి భారీ వర్షాలు పడుతున్నాయని అధికారులు తెలిపారు. రానున్న రెండు మూడు రోజులపాటు నగరవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని సూచిస్తున్నారు. నగరం పశ్చిమం వైపున ఉన్న గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, అల్విన్, చందానగర్, పటాన్ చెరు, అమీన్‌పూర్, ఇస్నాపూర్, బీరంగూడ, బీహెచ్‌ఈఎల్, హైటెక్ సిటీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ తదితర ప్రాంతాల్లో గురువారం కూడా వర్షాలు దంచికొట్టాయి.వానలతో చాదర్ ఘాట్, మలక్ పేటలలో వరద నీరు నిలిచింది. చాదర్ ఘాట్ నుంచి మలక్ పేట, దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఐటీ కారిడర్ ప్రాంతాల్లోనూ
ట్రాఫిక్ స్తంభించిందని పోలీసులు తెలిపారు. రాత్రి వరకు నిరంతరాయంగా
వర్షం కురుస్తుందని.. నగర పౌరులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.భాగ్యనగరానికి రెడ్ అలర్ట్ జారీ చేయడంతో పరిస్థితులను నిరంతరం మానిటర్ చేసేందుకు జీహెచ్‌ఎంసీ విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగాయి. ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలంటూ అధికారులు హెచ్చరించారు.




# మహేష్ ఫ్యామిలీ కూడా మొత్తం దిగుతుందా?

హాలీవుడ్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ ముఫాసా బాలీవుడ్ డబ్బింగ్ బాద్యతలు మొత్తం కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ ఫ్యామిలీ తీసుకున్న సంగతి తెలిసిందే. సింబ పాత్రకు షారుక్ పెద్ద కుమారుడు ఆర్యన్ ఖాన్, చిన్న కుమారుడు అబ్రామ్ ఖాన్ యువ ముఫాసాకు, ముఫాసా పాత్రకు షారుఖ్ గాత్ర దానం చేస్తున్నారు. ఈ ముగ్గురి ఎంట్రీతో ముఫాసాకి ఎనలేని క్రేజ్ వచ్చేసింది. అసలే హిట్ కంటెంట్ కావడం సహా కింగ్ ఖాన్ ఫ్యామిలీ కూడా తోడవ్వడంతో సినిమాపై అంచనాలు అంతకంతకు రెట్టింపు అవుతున్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వస్తోంది. యూ ట్యూబ్ లో రికార్డు వ్యూస్ తో దూసుకు పోతుంది. నార్త్ వరకూ ముఫాసా వేగం మామూలుగా లేదనే చెప్పాలి. మరి సౌత్ లో ...అందులోనూ తెలుగులో ఆ బాధ్యతలు తీసుకునేది ఎవరు? అంటే సూపర్ స్టార్ మహేష్ ని రంగంలోకి దించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ముఫాసా పాత్రకు మహేష్ బాబుతో డబ్బింగ్ చెప్పించాలని మేకర్స్ చర్చలు జరుపుతున్నారుట. అదే నిజమైతే మేకర్స్ మహేష్ ఫ్యామిలీ మొత్తాన్ని కూడా దించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. సితారకు సినిమాలంటే పిచ్చి. డాన్సులు ఇరగదీస్తుంది. హాలీవుడ్ సినిమాకి డబ్బింగ్ చెప్పే అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటుంది? డాడ్ కూడా అంతే ప్రోత్సహిస్తారు. ఇక గౌతమ్ యాక్టివ్ గా లేకపోయినా? ఇది రేర్ ఛాన్స్ కాబట్టి ఛాన్స్ తీసుకునే అవకాశం లేకపోలేదు. మహేష్ ఎలాగూ అవసరమైనప్పుడల్లా స్నేహితుల కోసం అప్పుడప్పుడు డబ్బింగ్ చెబుతుంటాడు. ముఫాసా లాంటి సినిమాకి గాత్ర దానం చేస్తే అది మరింత గుర్తింపును తీసుకొస్తుంది.





# మరో సినిమాపై చిరు దృష్టి

కథానాయకుడు చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'తో సెట్స్‌పై గడుపుతున్న సంగతి తెలిసిందే. వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే దీని తర్వాత చిరు చేయనున్న ప్రాజెక్ట్ ఏదన్నది అందరిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే ప్రస్తుతం సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మోహన్‌రాజా దర్శకత్వంలో చిరు ఓ సినిమా చేసేందుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. దీనికి బి.వి.ఎస్ రవి కథ అందిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ స్క్రిప్ట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయని.. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారని వార్తలొస్తున్నాయి. నిర్మాతగా చిరు తనయ సుస్మిత కొణిదెల వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.




# అనిల్ రావిపూడితో వెంకటేశ్ సినిమా



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్, దిల్‌రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'ఎఫ్2', 'ఎఫ్3' సినిమాల తర్వాత ఈ ముగ్గురి కాంబోలో వస్తున్న చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. ఈ సినిమా ఇటీవలే పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్ర సెట్లోకి వెంకటేశ్ అడుగు పెట్టారు. ఈ మేరకు చిత్ర బృందం ఓ మేకింగ్ వీడియోని పంచుకుంది. దీన్ని బట్టి ఈ ప్రస్తుత షెడ్యూల్‌లో వెంకీతో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై కుటుంబ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. తన అందమైన భార్య.. మాజీ ప్రియురాలు మధ్య జరిగే క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండనుంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీత మందిస్తుండగా.. సమీర్ రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



# తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రజిషా విజయన్

తనదైన నటనతో తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది రజిషా విజయన్. కోలీవుడ్ స్టార్ కార్తి హీరోగా నటించిన 'సర్దార్' చిత్రంలో ఆమె పోషించిన పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం తెరకెక్కుతోన్న 'సర్దార్2'లోనూ రజిషా కీలక పాత్ర పోషిస్తోందని మేకర్స్ గురువారం ప్రకటించారు. ఆమెకు వెల్‌కమ్ చెబుతూ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పిఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఎస్ జే సూర్య మరో ప్రముఖ పాత్ర చేస్తున్నాడు. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుగుతోందని, భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నట్టు నిర్మాత తెలియజేశారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వచ్చిన 'సర్దార్' సక్సెస్ అందుకోవడంతో సీక్వెల్‌పైనా అంచనాలు ఏర్పడ్డాయి.

# సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో టబు

'కథ విన్న వెంటనే... ఎలాంటి సందేహం లేకుండా సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో నటించడానికి అంగీకరించాను' అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక టబు. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ.. త్వరలో 'డ్యూన్:ప్రాఫెసీ' అనే హాలీవుడ్ వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. విజయవంత మైన 'డ్యూన్' వెబ్‌సిరీస్‌కి ప్రీక్వెల్‌గా డెనిస్ వి÷-లలెనెయువ్ రూపొందిస్తున్న సిరీస్ ఇది.కథ విన్న వెంటనే... ఎలాంటి సందేహం లేకుండా సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో నటించడానికి అంగీకరించాను అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక టబు. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ.. త్వరలో 'డ్యూన్:ప్రాఫెసీ' అనే హాలీవుడ్ వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. విజయవంతమైన 'డ్యూన్' వెబ్‌సిరీస్‌కి ప్రీక్వెల్‌గా డెనిస్ వి÷-లలెనెయువ్ రూపొందిస్తున్న సిరీస్ ఇది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఇందులోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర సంగతులను పంచుకుంది. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రను పోషించడం మంచి అనుభవం. ఈ పాత్ర కోసం నన్ను సంప్రదించినప్పుడు ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా అంగీకరించాను. బలమైన, తెలివైన, ఆకర్షణీయమైన పాత్ర ఇది. ఒక నటికి ఇలాంటి పాత్రల్లో నటించినప్పుడు చాలా సంతృప్తిగా ఉంటుంది. మునుపెన్నడూ ఇలాంటి భిన్నమైన పాత్రను పోషించలేదు. ఇది ఈ సిరీస్‌కే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఇలాంటి ఓ గొప్ప కథతో ప్రేక్షకులను పలకరించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పుకొచ్చింది. మనిషి మనుగడకు ముప్పు తెచ్చే శక్తులతో హర్కొనెస్ సిస్టర్స్ ఎలా పోరాడారనే కథాంశం ఆధారంగా దీన్ని రూపొందించారు.



# ఆర్ఆర్ఆర్‌లో రామ్‌చరణ్ నటన అదుర్స్

**ఫ్రెంచ్ హీరో లూకాస్ బ్రావో ప్రశంసలు**




భారతీయ సినిమా స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ సినిమాతో రామ్ చరణ్ , ఎన్టీఆర్‌లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. పలువురు హాలీవుడ్ ప్రముఖులు గతంలో ఈ సినిమాను ప్రశంసించగా.. తాజాగా ఫ్రెంచ్ హీరో లూకాస్ బ్రావో.. రామ్ చరణ్‌ను మెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియోను ఆయన అభిమానులు షేర్ చేస్తున్నారు. దీంతో ఎక్స్‌లో 'ఆర్ఆర్ఆర్' పేరు దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఆర్ఆర్ఆర్'లో మెయిన్ హీరో రామ్ చరణ్ నటన అద్భుతం. ఎంట్రీ సీన్, ఎమోషనల్ సన్నివేశాల్లో బాగా నటించారు. యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నారు' అని ప్రశంసించారు. ఎస్.ఎస్.రాజమౌళి ( దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా '2022లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఆస్కార్ అవార్డుల్లోనూ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్'తో బిజీగా ఉన్నారు. శంకర్ దర్శకత్వంలో పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపించనుండగా.. అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బాలివుడ్‌పై కన్నేసిన శ్రీలీల

కథల ఎంపికలో జోరు చూపిస్తోంది అందాల తార శ్రీలీల. ఇప్పటికే 'భగవంత్ కేసరి', 'గుంటూరు కారం' లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈమె.. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైంది. బాలీవుడ్ కథానాయకుడు సిద్దార్థ్ మల్హోత్రా 'మిట్టి' అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. బల్వీందర్ సింగ్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ సినిమాలో కథానాయికగా శ్రీలీల ఎంపికైనట్లు సమాచారం. 'కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ కథ విన్న వెంటనే సిద్దార్థ్ సరసన నటించడానికి అంగీకారం తెలిపింది శ్రీలీల. ఈ చిత్రంతో తన బాలీవుడ్ ప్రయాణం ప్రారంభం కాబోతున్నందుకు చాలా ఉత్సాహంగా ఉందీమె. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణను అక్టోబరులో మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నార'ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'రాబిన్‌హుడ్', 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలతో బిజీగా ఉంది శ్రీలీల.